క్లుప్తంగా

ప్రారంభానికి నోచుకోని ఆరోగ్య కేంద్రం



గడివేముల పీహెచ్‌సీలో ప్రారంభానికి నోచుకోని పబ్లిక్ హెల్త్ యూనిట్

గడివేముల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నూతనంగా నిర్మించిన పబ్లిక్ హెల్త్ యూనిట్ సెంటర్ నిర్మాణం పూర్తై రోజులు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దాదాపు రూ.20 లక్షల దాకా ఖర్చు చేసి ప్రజల సౌకర్యార్థం నిర్మించిన హెల్త్ యూనిట్‌ను వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం



డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త, సీసాలు

కల్లూరు: అర్బన్ పరిధి 31వ వార్డులోని రాఘవేంద్ర నగర్, శరీన్‌నగర్ కాలనీలో పారిశుద్ధ్యం పడకేసింది. డ్రైనేజీ కాలువ చెత్త చెదారం, పేపర్లు, ఖాళీ సీసాలతో నిండి మురుగు నీరు ముందుకు ప్రవహించడం లేదు. సంబంధిత అధికారులు డ్రైనేజీలో పూడికను తొలగించి మురుగు నీరు నిల్వ ఉండకుండా ముందుకు పారేలా చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

పకడ్బందీగా రాత పరీక్ష



పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న ఆర్డీఓ సందీప్‌కుమార్

కర్నూలు(రూరల్): కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న, నూతనంగా ఏర్పడిన 74 రేషన్ దుకాణాల డీలర్ల నియామకానికి ఆదివారం బిజీఎంఎం పాఠశాలలో నిర్వహించిన పరీక్షకు 625 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్, కర్నూలు రెవెన్యూ డివిజన్ అధికారి సందీప్‌కుమార్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి 1:5 రేషియోలో సోమవారం ఉదయం 10 గంటలకు ఆర్‌డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని వారు వెల్లడించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(రూరల్): తన సొంత గ్రామం పంచలింగాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎంపీ బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.14 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తన సొంత గ్రామాన్ని అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం



అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఒరిగిన విద్యుత్ స్తంభం

ఓర్వకల్లు: విద్యుత్ అధికారుల అలసత్వం, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అంగన్‌వాడీ కేంద్రానికి ప్రమాదం పొంచి ఉంది. మండల కేంద్రం ఓర్వకల్లులోని పెండేకంటి నగర్‌లో 1వ అంగన్‌వాడి కేంద్రం వద్ద దశాబ్దాల క్రితం నిర్మించిన ఇనుప విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరుకుంది. అక్కడి నుంచి పక్కనే ఉన్న స్తంభానికి విద్యుత్ తీగల ద్వారా సరఫరా ఇచ్చారు. ఈ రెండు స్తంభాల మధ్య విద్యుత్ తీగ చెట్టుకొమ్మకు రాజుకొని తెగిపోయింది. దీంతో అంగన్‌వాడీ భవనంపై ఎప్పుడు పడుతుందోనని కేంద్రం నిర్వాహకులు భీతిల్లుతున్నారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకున్న పాపాన పోలేదు. అలాగే కేంద్రానికి ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నర్సులు లేని కాన్పుల ఆస్పత్రి

- సి.బెళగల్ పీహెచ్‌సీలో ఒక్క నర్సు కూడా లేక అవస్థలు
- ఆస్పత్రిలో నెలకు 25 దాకా ప్రసవాలు
- స్టాఫ్ నర్సుల లేమితో గర్భిణులు సతమతం
- పట్టించుకోని ఉన్నతాధికారులు



కాన్పుల ఆస్పత్రిగా గుర్తింపు పొందిన సి.బెళగల్ పీహెచ్‌సీ



పీహెచ్‌సీలో మహిళకు సాధారణ కాన్పు చేసిన సిబ్బంది (ఫైల్)

సి.బెళగల్: కాన్పుల ఆసుపత్రిగా గుర్తింపు పొందిన సి.బెళగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో స్టాఫ్ నర్సులు లేక గర్భిణులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. మండల కేంద్రం సి.బెళగల్‌లో 24 గంటల ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిగా ఉన్న పీహెచ్‌సీకి మండలంలోని గ్రామాలతో పాటు, పొరుగు మండలాలు, ప్రాంతాల నుంచి ప్రసవాల కోసం పెద్ద ఎత్తున గర్భిణులు వస్తుంటారు. అయితే పీహెచ్‌సీలో ఎనిమిది గంటల పనిలో భాగంగా ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉంది. అయితే బదిలీ, సెలవులు తదితర కారణాలతో ఒక్క స్టాఫ్ నర్సు కూడా అందుబాటులో లేకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

స్టాఫ్ నర్సులు ఏరీ?

సి.బెళగల్ పీహెచ్‌సీలో 24 గంటలు మెటర్నరీ సేవలు అందించేలా ముగ్గురు స్టాఫ్ నర్సు పోస్టులను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ఒక పోస్టు రెగ్యులర్ కాగా, మరో రెండు పోస్టులు ఔట్‌సోర్సింగ్‌లో భాగంగా నియమించుకోవాల్సి ఉంది. రెగ్యులర్ స్టాఫ్ నర్సుకు పదోన్నతిలో భాగంగా 2024 జనవరి నెలలో ఏలూరుకు బదిలీ అయ్యింది. తదనంతరం ఔట్‌సోర్సింగ్ స్టాఫ్ నర్సు 2024 జనవరిలోనే ఉద్యోగానికి రాజీనామా చేయగా, మిగిలిన ఒక్క ఔట్‌సోర్సింగ్ స్టాఫ్ నర్సు గత అక్టోబర్ వరకు పనిచేసి నవంబర్ 1వ తేదీ నుంచి మెడికల్ లీవ్‌లో వెళ్లారు. అదేవిధంగా ఫిమేల్ నర్సింగ్ ఆడర్ పోస్టు 2023 నుంచి ఖాళీగా ఉండగా, మరో సపోర్టు పోస్టు అయిన ఎమ్ఎన్ఓ కలెక్టర్ బంగ్లాలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. దీంతో ప్రస్తుతం ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలతో కాన్పులు చేయిస్తున్నారు.

నెలలో 25 దాకా ప్రసవాలు

సి.బెళగల్ పీహెచ్‌సీలో సాధారణ వైద్య సిబ్బంది ఓపికతో ప్రసవాలు చేస్తుండటంతో రోజువారీ కనీసం రెండు నుంచి ఐదు వరకు కాన్పులు ఉంటున్నాయి. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు పీహెచ్‌సీలో నెలలవారీగా ప్రసవాల సంఖ్య ఈ విధంగా ఉంది. 2024 జనవరిలో 14, ఫిబ్రవరి - 6, మార్చి - 8, ఏప్రిల్ - 11, మే - 23, జూన్ - 20, జులై - 15, ఆగస్టు - 22, సెప్టెంబర్ - 21, అక్టోబర్ - 28, నవంబర్ - 27, డిసెంబర్ - 29 (28వ తేదీ వరకు) ప్రసవాలు జరిగాయి. ఇలా సంవత్సరానికి ఎంత లేదన్నా దాదాపు మూడు వందల వరకు ప్రసవాలు ఇక్కడి పీహెచ్‌సీలో జరుగుతుంటాయి.

ఒకే రోజు ఆరు కాన్పులు

గతేడాది ఆగస్టులో ఒకే రోజు అత్యధికంగా ఆరు ప్రసవాలు జరిగాయి. 2024 ఆగస్టు 30న గద్వాలకు చెందిన జాన్సీరాణి తెల్లవారుజామున 12:43 గంటలకు ప్రసవం జరగగా, ఉదయం 5:59 కు కరిదికొండకు చెందిన రజిత, అదేవిధంగా 10:37కు ముడుమాల గ్రామ మహిళ తెలుగు జయలక్ష్మి, మధ్యాహ్నం 2:10 పెద్దనేలటూరు గ్రామానికి చెందిన లక్ష్మి, సాయంకాలం 7:36కు ముడుమాలకు చెందిన గంగమ్మ, 7:50కు బురాన్‌దొడ్డి నయోమితో కలిసి ఒకే రోజు ఆరుగురు పీహెచ్‌సీలోనే ప్రసవమయ్యారు.

పల్లె జనాన్ని పట్టించుకోని అధికార యంత్రాంగం

సి.బెళగల్ మండలం నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా కేంద్రం కర్నూలుకు వెళ్లాలంటే వ్యయప్రయాసాలతో కూడిన పని. పైగా పది కిలోమీటర్ల పరిధిలో అందుబాటులో ఉన్న పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచితంగా సుఖ ప్రసవాలు జరుగుతుండటంతో, పల్లె జనం తమ ఇళ్లలోని గర్భిణులను పెద్ద ఎత్తున పీహెచ్‌సీకి తీసుకవస్తున్నారు. అదేవిధంగా మొదటి కాన్పులను సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది సాధారణ కాన్పులు చేస్తుండటంతో పీహెచ్‌సీకి కాన్పుల ఆసుపత్రిగా గుర్తింపు వచ్చింది. అయితే స్టాఫ్‌నర్సుల సమస్యపై ప్రజలు మండల, జిల్లా అధికార యంత్రాంగానికి మొరపెట్టుకున్నా ఎలాంటి స్పందన ఉండటం లేదని పల్లె జనం ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుల లేమితో గర్భిణులు సతమతం అవుతున్నారు.

నర్సులు ఉంటే బాగుంటుంది



బెళగల్ ఆసుపత్రిలో నర్సులు లేరంటున్నారు. అందుబాటులో ఉన్న ఇతర విభాగం వారితో కాన్పులు చేయిస్తున్నారు. మాలాంటి పేదలు కాన్పులకు కర్నూలుకు వెళ్లాలంటే చాలా కష్టంగా ఉంటుంది. బెళగల్ ఆసుపత్రిలో కాన్పులు బాగా చేస్తారని అన్ని పల్లెల నుంచి ఎక్కువ మంది ఇక్కడికే వస్తున్నారు. ఆసుపత్రిలో అవసరమైన మేరకు నర్సులు ఉంటే బాగుంటుంది. **– ఉప్పరి లక్ష్మి, సి.బెళగల్**

భయపడుతూనే వచ్చాం



ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు బాగా చేస్తారంటే మంచిది అనుకున్నాం. కానీ ఇక్కడ నర్సులు లేరని తెలిసింది. భయపడుతూనే ఆసుపత్రికి వచ్చాక కాన్పులను ఇతర విభాగం వారు చేస్తారని చెప్పారు. దేవుడి దయవల్ల ఆసుపత్రిలో మా పాప కాన్పు ఎలాంటి సమస్య లేకుండా జరిగింది. నర్సులు ఉంటే ఎలాంటి భయం ఉండేది కాదు. **– భాగ్యమ్మ, క్రిష్ణదొడ్డి**

స్టాఫ్ నర్సులను నియమించాలి



సి.బెళగల్ పీహెచ్‌సీకి ప్రసవాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్న మంచి పేరు ఉండేది. అయితే ఇప్పుడు పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సులు లేరు. నర్సుల సమస్యలతో ప్రజలు కాన్పులకు ఆసుపత్రికి వచ్చేందుకు భయపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ ప్రజలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. వెంటనే సి.బెళగల్ పీహెచ్‌సీకి అవసరమైన స్టాఫ్ నర్సులు, ఖాళీగా ఉన్న పోస్టులకు సిబ్బందిని నియమించాలి. **– పాండురంగన్న, సి.బెళగల్ సర్పంచ్**

ఉన్నతాధికారులకు సమస్యను తెలియజేశాం



పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సులు అందుబాటులో లేరనేది వాస్తవమే. సమస్యను జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశాం. అదేవిధంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా, సమస్యలు లేకుండా ఇతర సిబ్బంది అందుబాటులో ఉండి గర్భిణులకు అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నాం. పీహెచ్‌సీలో ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్నాయి. **– మిథున్‌కుమార్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్, సి.బెళగల్**

క్రికెట్ టోర్నీ విజేత బ్రాహ్మణకొట్కూరు

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో బ్రహ్మణకొట్కూరు జాక్స్ ప్యారో జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 28 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌కు ప్యాలకుర్తి ఎస్సీ కాలనీ జట్టు, బ్రహ్మణకొట్కూరు జ్యాక్స్ ప్యారో జట్టు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బ్రహ్మణకొట్కూరు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 110 పరుగులు చేయగా, ప్యాలకుర్తి ఎస్సీ కాలనీ జట్టు 10 ఓవర్లలో 81 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. విన్నర్‌గా నిలిచిన బ్రహ్మణకొట్కూరు జట్టుకు రూ.50 వేలు, రన్నరప్‌గా నిలిచిన ప్యాలకుర్తి ఎస్సీ కాలనీ జట్టుకు రూ.30 వేల నగదును కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు చేతుల మీదుగా నిర్వాహకులు ప్రదానం చేశారు. గ్రామపెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేత బ్రాహ్మణకొట్కూరు జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

'తల్లికి వందనం' తక్షణమే అమలు చేయాలి

- పెండింగ్‌లో ఉన్న రూ.3,580 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర బకాయిలు విడుదల చేయాలి
- బాబు.. జాబ్ క్యాలెండర్ ఎక్కడ ?
- ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటికె గౌతమ్ ప్రశ్న



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటికె గౌతమ్

కర్నూలు (టౌన్): రాష్ట్రంలో నెలకొన్న విద్యార్థి సమస్యలపై ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నాం. ఎలాంటి షరతులు లేకుండా ఈ ఏడాది నుంచే తల్లికి వందనం పథకం అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటికె గౌతమ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను అటకెక్కించి రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన మ్యానిఫెస్టోలోని ఒక్క హామీని కూడా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడిచినా ఇప్పటివరకు 'తల్లికి వందనం' అమలు చేయలేదని, దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వానికి విన్నవించినా స్పందన లేదన్నారు. విద్యా సంవత్సరం పూర్తి కావొస్తున్నా ఈ పథకం అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.3,580 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఎన్నికల హామీ ఇచ్చిన ప్రకారం జీఓ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి సంవత్సరం జనవరి మొదటి వారంలోగా ఇస్తామన్న జాబ్ క్యాలెండర్ ఎక్కడ అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత ప్రభుత్వం అమలు చేసిన జీఓ 85ను కొనసాగించి ఇంగ్లిష్ మీడియం విద్యను పక్కాగా అమలు చేయాలన్నారు. పేద బడుగు, బలహీన వర్గాలకు ఇంగ్లిష్ మీడియం విద్యను దూరం చేసే కూటమి ప్రయత్నాలను తిప్పి కొడతామని స్పష్టం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రామకృష్ణ, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ధోనీ బాలరాజు, నర్సింగ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు శ్రీకాంత్ రెడ్డి, కోట్ల మధుకుమార్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఓర్వకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక, వ్యక్తిగత సమస్యలపై వినతులు సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల వినతులను పరిశీలించి తక్షణమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పీజీఆర్ఎస్‌కు అధికారులందరూ హాజరుకావాల్సిందే

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) పురుషోత్తం అన్నారు. ఆదివారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడిస్తూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పకుండా హాజరు కావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే మండల ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

సి.బెళగల్: పాఠశాలలో సోమవారం నిర్వహించనున్న ఎస్ఎంసీ సభ్యుల శిక్షణ కార్యక్రమాన్ని హెచ్ఎంలు, టీచర్లు విజయవంతం చేయాలని ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాష సూచించారు. వారు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంటూ.. మండలంలోని 43 ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎంలు, టీచర్ల ఆధ్వర్యంలో పాఠశాలల్లో విద్యా కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించి, పాఠశాలల నిర్వహణ, విద్యా ప్రగతి, ఎస్ఎంసీ సభ్యుల పాత్ర, సహకారాలపై శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. శిక్షణ వివరాలను సోమవారం సాయంత్రం ఎంఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పొంచి ఉన్న ప్రమాదం



అమడగుంట్ల-కె.నాగలాపురం రోడ్డుకు ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న గుంత

కోడుమూరు రూరల్: మండలంలో అమడగుంట్ల నుంచి కె.నాగలాపురం వెళ్లే రోడ్డులో గత వర్షాకాలం కురిసిన వానలకు పత్తిగింజ వంక వద్ద రోడ్డు కోతకు గురైంది. ఈ రోడ్డులో వాహనాలు క్రాస్ చేసే సమయంలో గమనించకుండా సైడ్‌కు వెళితే ప్రమాదాలు జరిగే అవకాశముంది. కోతకు గురైన రోడ్డును మరమ్మతులు చేయాల్సిన అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో కొందరు వ్యక్తులు రోడ్డు కోతకు గురైన ప్రాంతం వద్ద వాహనదారులు అటువైపు వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా రెండు రాళ్లను అడ్డంగా పెట్టారు. పగటిపూట వాహనదారులు గమనించి వెళ్లినప్పటికీ రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశముంది. ప్రస్తుతం ఈ రోడ్డుకు ప్యాచ్ వర్క్‌లు జరుగుతున్న నేపథ్యంలో కోతకు గురైన చోట బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కామ్రేడ్ సూర్యనారాయణకు నివాళి



కామ్రేడ్ సూర్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కామ్రేడ్ పి.సూర్యనారాయణ ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. ఆదివారం కల్లూరులోని సూర్యనారాయణ భవన్‌లో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ పి.సూర్యనారాయణ 37వ వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు పి.నిర్మల, గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ కార్మికులు, రైతు కూలీల కోసం అనేక పోరాటాలు చేసిన వ్యక్తి సూర్యనారాయణ అన్నారు. కార్మికులు, కష్ట జీవుల కోసం నిరంతరం కృషి చేశారని, ఆయన ఆశయాలను కార్యకర్తలు ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక పేరుతో ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రాల హక్కులు హరించే ప్రయత్నం చేస్తున్నారని, ఈ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం పోరాటాలు చేస్తుందన్నారు. సీపీఎం నాయకులు రామకృష్ణ, సాయిబాబా, రాముడు, సుధాకరప్ప, నరసింహులు, ప్రభాకర్, రమణమూర్తి, ఏసు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



వాహనదారుడిని బ్రీత్ అనలైజర్‌తో పరీక్షిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్: వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తప్పవని కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు స్థానిక కర్నూలు రోడ్డులో ఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో వాహనాల తనిఖీలు, డ్రంకన్ డ్రైవ్ టెస్ట్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై కేసులు నమోదు చేయడంతో పాటు, సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనదారులంతా రోడ్డు నిబంధనలు తూచ తప్పక పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే సమయంలో సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

కుగ్రామం నుంచి ఢిల్లీ పరేడ్‌కు..

- ఆర్‌యూ నుంచి రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన మొదటి యువకుడు
- జిల్లా యువకుడి ఘనతపై హర్షం

జిల్లాలోని మారుమూల గ్రామానికి చెందిన ఓ విద్యార్థి రిపబ్లిక్ డే సందర్భంగా ఢిల్లీలో జరగనున్న పరేడ్‌కు ఎంపికై శభాష్ అనిపించుకున్నాడు. రాయలసీమ యూనివర్సిటీ ఏర్పాటయ్యాక మొట్టమొదటిసారిగా ఓ విద్యార్థి రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక కావడం విశేషం. ప్రస్తుతం ఢిల్లీలో ఎన్ఎస్ఎస్ ఆర్‌డీసీ క్యాంప్ శిక్షణలో ఉన్న విద్యార్థి పరేడ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నాడు.



హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న ఆర్‌యూ వీసీ ఎన్‌టీకే నాయక్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ నాగరాజు, పీడీ

కర్నూలు కల్చరల్: ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌కు జిల్లా నుంచి రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల విద్యార్థి హర్షవర్ధన్ ఎంపికయ్యాడు. రాయలసీమ యూనివర్సిటీ ఏర్పాటయ్యాక ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆర్‌డీసీ పరేడ్‌కు మొదటిసారి వలంటీర్ కురుబ హర్షవర్ధన్ ఎంపిక కావడం విశేషం. ఆలూరు సమీపంలోని అరికెర గ్రామానికి చెందిన కె.నాగలక్ష్మీదేవి, పత్తికొండ మండలంలోని నలకదొడ్డి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కె.ఉలైప్ప దంపతుల కుమారుడు కురుబ హర్షవర్ధన్. ఈ యువకుడు పాఠశాల విద్యను కర్నూలు ఏపీఎస్పీ క్యాంప్‌లోని సీఆర్ఆర్ఎమ్ఎమ్‌సీ హైస్కూల్‌లో, ఇంటర్ ఉస్మానియా కళాశాలలో చదివాడు. కర్నూలు నగరం సుంకేసుల రోడ్‌లోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ మూడో సంవత్సరం చదువుచున్నాడు. ఎన్ఎస్ఎస్ ఆర్‌డీసీ పరేడ్ క్యాంప్ ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహిస్తారు. ఇందులో దేశవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల నుంచి 200 మంది వలంటీర్లు పాల్గొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి నంచి ఐదుగురు విద్యార్థులు, ఐదుగురు విద్యార్థినులు క్యాంప్‌లో పాల్గొంటున్నారు. అందులో ఆర్‌యూ తరఫున హర్షవర్ధన్ ప్రతినిధ్యం వహిస్తున్నాడు. ఈ వలంటీర్లు రాష్ట్రపతి, ప్రధానమంత్రితో కలిసి డిన్నర్ చేయడం, వారి సమక్షంలో ప్రదర్శన చేయనున్నారు. హర్షవర్ధన్ ఎంపిక పట్ల వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు అభినందనలు తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగే పరేడ్‌కు హర్షవర్ధన్ ఎంపిక కావడం ఉమ్మడి జిల్లాకు గర్వకారణమని వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శివకిషోర్ పేర్కొన్నారు.

గర్వంగా ఉంది



ఆర్‌యూ తరఫున ఎన్ఎస్ఎస్ ఆర్‌డీసీ క్యాంప్‌లో పాల్గొంటున్నందుకు గర్వంగా ఉంది. తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం, వర్సిటీ అధికారుల సహాయ సహకారాలు, మార్గదర్శనంతో క్యాంప్‌నకు ఎంపిక కాగలిగాను. నెల రోజుల పాటు క్యాంప్ ఉంటుంది. రాష్ట్రపతి, ప్రధాన మంత్రి సమక్షంలో పరేడ్‌లో పాల్గొనడం, వారి ముందు డ్యాన్స్ ప్రదర్శించడం, ప్రధాన మంత్రితో కలిపి డిన్నర్ చేయడం లాంటి గొప్ప అవకాశాలు నాకు లభించాయి. అందుకోసం ఆసక్తిగా ఎదురు చూసున్నా. క్యాంప్‌లో ప్రతి రోజు ఉదయం 6.20 నుంచి 7.30 గంటల వరకు డ్రిల్, 8.40 నుంచి 12.30 గంటల వరకు పరేడ్ మార్చ్‌ఫాస్ట్ ప్రాక్టీస్, మధ్యాహ్నం ఎడ్యుకేషన్ సెషన్, సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు కల్చరల్ ప్రోగ్రామ్స్ ప్రాక్టీస్ ఉంటుంది. రాష్ట్రం తరఫున ఒక జానపద నృత్యం, ఒక జానపద గీతం, ఒక స్కిట్‌ను ప్రదర్శించనున్నాం.

– ఎ.కె.హర్షవర్ధన్, ఆర్‌యూ ఎన్ఎస్ఎస్ వలంటీర్

నేడు మండల మీట్

పాణ్యం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఉదయం ఆర్‌బీకే, గ్రామ సచివాలయం, హెల్త్ సెంటర్ ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండల మీట్‌కు హాజరు కావాలన్నారు. అలాగే ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. మండలస్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఈ.తాండ్రపాడు గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ బాలపీరా, సీపీఎం నాయకులు ఆదివారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు ఆయన నివాసంలో వినతి పత్రం అందజేశారు. ఇందిరమ్మ కాలనీ, ఎస్సీ కాలనీలో గృహాలు శిథిలావస్థకు చేరాయని, వాటిని పునర్నిర్మించాలని కోరారు. జలజీవన్ పథకం కింద గ్రామానికి గతంలో నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభించలేదని చెప్పారు. గ్రామానికి సురక్షిత మంచినీటి పథకానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. వార్డు మెంబర్ వెంకటేశ్వర్లు, పి.బి.హుసేనయ్య, ఎస్.గోపాల్, బి.మునిస్వామి, నాయుడు, నాగరాజు తదితరులు ఉన్నారు.